ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 19.10.2024 సమయం:1.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కళలు అపరిమిత స్వేచ్ఛ , క్రమశిక్షణ, వైవిధ్యం అందిస్తాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.
2. పంటలు వేసిన భూములకే రైతు భరోసా ఇస్తామని , నిపుణుల నివేదిక అందగానే నిధులు విడుదల చేస్తామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.
3. మూసీ బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు అన్నారు.
4. హైదరాబాద్ చార్మినార్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ దినం' కార్యక్రమం జరిగింది.

**గవర్నర్- డైవర్స్ వాయిసెస్:**

హైదరాబాద్ సాలార్ జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన - డైవర్స్ వాయిసెస్ , న్యూరో డైవర్స్ కళాకారుల కళా ప్రదర్శనను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ ఉదయం ప్రారంభించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ , సాలార్ జంగ్ మ్యూజియం అధ్వర్యంలో ఆర్ట్ సాంక్చురీ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో న్యూరలాజికల్ సవాళ్ళను ఎదుర్కొంటున్న పలువురు కళాకారులు వంద పైగా కళా రూపాలను ప్రదర్శనకు ఉంచారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ , అద్భుతమైన కళా ప్రదర్శనను చూసే అవకాశం డైవర్స్ వాయిసెస్ తో లభించిందని అన్నారు. కళలు అపరిమిత స్వేచ్ఛ, సునిశిత క్రమశిక్షణ, వైవిధ్యం అందిస్తాయని , అదే భారతీయ సాంస్కృతిక వైవిధ్య సంపద అని పేర్కొన్నారు. కళాకారులు తమ భావనలను అద్భుతంగా వ్యక్తీకరించారనీ, మాటలకు అందని అనుభవాన్ని సందర్శకులకు ఈ ప్రదర్శన అందిస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు, ప్రముఖ రంగస్థల కళాకారులు అమహ్మద్ అలీ బేగ్ మాట్లాడుతూ , న్యూరో సమస్యలతో ఉన్న పిల్లలను కళల్లో ప్రోత్సహించటంపై వారి తల్లిదండ్రులను అభినందించారు. ప్రముఖ కళాకారిణి దుర్గా జస్రాజ్ మాట్లాడుతూ, కళ ప్రధాన ఉద్దేశ్యం స్ఫూర్తిని అందించటమే నని , న్యూరో డైవర్స్ కళాకారులు అందించిన చిత్రాలు సృజనకు హద్దులు లేవని నిరూపించాయని పేర్కొన్నారు. సాలార్ జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఆశిష్ గోయల్ , ఆర్ట్ సాంక్చురీ మేనేజింగ్ డైరెక్టర్ షాలినీ గుప్తా , పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

----- MSL

THUMMALA

పంటలు వేసిన భూములకే రైతు భరోసా ఇ వ్వనున్నట్లు, ఈ ప్రక్రియపై నిపుణుల నివేదిక అందగానే నిధులు విడుదల చేస్తామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. హైదరాబాద్ లోని బీఆర్కే భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... పంటలు వేయని భూములకు రైతు భరోసా ఇవ్వమని , సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయిల బోనస్ ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 18 వేల కోట్ల రూరపాయల రుణమాఫీ చేశామన్నారు. 2018 నుంచి 2023 డిసెంబర్ వరకు తీసుకున్న రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పారు. 2 లక్షల రూపాయిలకు పైగా రుణాలు తీసుకున్న వాళ్లు, మిగులు రుణాన్ని చెల్లిస్తే, రుణమాఫీ చేస్తామన్నారు.

డెస్క్

**KTR**

ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ , టీడీపీ పార్టీల ప్రభుత్వాలే మూసీ నదిని ఈ దుస్థికి తీసుకువచ్చిందని, మూసీ బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు మరోసారి హామీ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి తారక రామారావు నాగోల్ లోని మురుగునీటిని శుద్ధి చేసే ఎస్టీపీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్క డా లేని విధంగా హైదరాబాద్ లో ఎస్టీపీ కేంద్రం హైదరాబాద్‌లో ఉందన్నారు. తమ ప్రభుత్వం నిర్మించిన ఈ కేంద్రంలో రోజు 20 కోట్ల లీటర్ల మురికినీరు శుద్ధి అవుతోందని పేర్కొన్నారు. తుది వరకు మూసీ బాధితుల తరపున న్యాయ పోరాటం చేస్తామని తారకరామారావు ఈ సందర్భంగా ప్రకటించారు.

డెస్క్

**KISHAN REDDY**

మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేద ప్రజలకు బిజెపి అండగా ఉంటుందని, పేదల బతుకులను ఛిద్రం చేయాలనుకుంటే ఊరుకోమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మూసీ పరివాహక ప్రాంతాలైన, లంగర్ హౌస్ డివిజన్, రాందేవ్‌గూడ ప్రాంతాల్లో మూసీ, హైడ్రా బాధితుల ఇండ్లను పరిశీలించి, బాధితులతో కేంద్ర మంత్రి మాట్లాడారు.

SDP

**WARANGAL- SC, ST**

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని , పేదింపుల కేసులను వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో ఈరోజు కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో పాటు

సంబంధిత అధికారులతో ల్యాండ్, సర్వీస్ అట్రాసిటీ కేసులు వివిధ అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో వేదింపుల కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

పీటీసీ, వరంగల్

**డబుల్ ఇండ్లు...గోషామహల్**

హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గం లో 144 మంది లబ్దిదారులకు నాంపల్లిలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజాసింగ్, శ్రీగణేశ్ పాల్గొన్నారు.

DESL

**CM-REVANTH**

హైదరాబాద్ చార్మినార్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ దినం ' కార్యక్రమం జరిగింది. చార్మినార్ వద్ద 1990లో ఇదే రోజున మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ... ఈ కార్యక్రమంలో ఈ ఉదయం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా దేశం కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గీతారెడ్డి కి రాజీవ్ గాంధి సద్భావన అవార్డును ప్రధానం చేశారు.

SDP

**RTC**

ఆర్టీసీలో కండక్టర్లకు ప్రస్తుతం కొనసాగుతున్న ఓడీ-అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్ డ్యూటీలను విరమించుకుంటున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోలు , యూనిట్లలో ఓడీ డ్యూటీ చేస్తున్న కండక్టర్లను ఆ విధుల నుంచి తప్పించాలని ఆయా జిల్లాల ఆర్టీసీ అధికారులను ఆదేశించింది. కాగా , కొంతకాలంగా పలువురు కండక్టర్లు ఓడీలో భాగంగా డిపోలు,యూనిట్లలో సెక్యూరిటీ డ్యూటీలు చేస్తున్నారు.

PN

**NAGARJUNA SAGAR**

ఎగువ నుంచి వరద ఉధృతి పెరగడంతో నాగార్జున సాగర్ జలాశయం 8 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి ఎడమ కాలువలకు కలిపి 12,500 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 29 ,313 క్యూసెక్కులు, హైదారాబాద్ తాగు నీటి అవసరాలకు ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కులు , సాగర్ వరద కాల్వ ద్వారా మరో 400 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉంచుతూ... అదనపు నీటిని దిగువకు వదులుతున్నారు.

PTC, NALGONDA

**WARANGAL CP**

పోలీస్ ప్రతిష్టకు భంగం కలిగించే రీతిలో అధికారులు వ్యవహరిస్తే సహించబోమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. నిన్న సాయంత్రం వర్ధన్నపేట పోలీస్ డివిజనల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... డయల్

100 నుండి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించి , బాధితులకు వేగంగా సహాయం అందించాలని చెప్పారు.

PTC, Warangal

**GOLD MEDAL**

గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న 35వ సౌత్ జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ -18 విభాగంలో భద్రాచలానికి చెందిన శ్రీ తేజ బంగారు పతకం సాధించారు. 100 మీటర్స్ హార్డిల్ , హైజంప్, షాట్ పుట్, 200 మీటర్స్ రన్ , లాంగ్ జంప్, జావలిన్ త్రో వంటి ఏడు రకాల ఈవెంట్స్ లో ఆమె 4 ,663 పాయింట్స్ తో ప్రథమ స్థానంలో నిలిచారు. శ్రీ తేజ భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.
పీటీసీ, కొత్తగూడెం

**HIGHCOURT JUDGE**

తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ విజయసేన్ రెడ్డి ఈ ఉదయం మెదక్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. మెదక్ జిల్లా జడ్జి లక్ష్మీ శారద, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, ఎస్పీ ఉదయ్ కుమార్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆయనకు స్వాగతం పలికారు.
PTC, Medak

**WEATHER UPDATE**

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

PN

**ITI ADMISSIONS**

రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో ఐటీఐ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తు గడువును ఈనెల 30 వరకు పొడిగించారు. వివిధ ట్రేడ్లలో చేరేందుకు 8, 10వ తరగతిలో ఉత్తీర్ణులై 2024 ఆగస్టు ఒకటి నాటికి 14 ఏళ్లు నిండిన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులని అధికారులు తెలిపారు. వివరాలు iti.telangana.gov.in వెబ్ సైట్ లో చూడవచ్చు.

Desk

**CHIRUTHA**

హైదరాబాద్ లోని మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో కనిపించింది చిరుతపులి కాదని , ఒక అడవి పిల్లి అని... ఆటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. నిన్న చిరుతపులి వచ్చిందని సోషల్ మీడియాలో ఒక ఫోటో వైరల్ కావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అప్రమత్తమైన ఆటవీశాఖ అధికారులు, కదలికలను బట్టి దానిని అడవిపిల్లిగా తేల్చారు.

Desk